

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

హెచ్‌సీయూలో స్వచ్ఛభారత్

రాయదుర్గం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లోని చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు క్యాంపస్‌లోని వ్యర్థాలు, పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భీమ్‌సింగ్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న సెంట్రల్‌పార్కు ప్రతినిధులు

సెంట్రల్‌పార్కు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

గచ్చిబౌలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ మసీద్‌బండ సెంట్రల్ పార్కు సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సెంట్రల్ పార్కు ఫేజ్-1లో తాను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి చర్యలు చేపడతామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు హరి, కృష్ణ, బ్రహ్మయ్య, గోపి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకుల్‌ప్లాట్స్ కాలనీ సమస్యలపై..

హైదర్‌నగర్: మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్ కాలనీలోని నందయ్యయాదవ్ పార్కును అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. పార్కును అభివృద్ధి చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు సీహెచ్ సాంబయ్య, ప్రభాకర్, చంద్రప్రకాశ్‌రెడ్డి, దేవనాయక్, హరి, నిరంజన్, బాలరాజ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హైదర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీలోని వీరాంజనేయ శివాలయంలో శనివారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నిహారిక, శ్రేయ, నర్సులు సునీత, లావణ్య పాల్గొన్నారు.

మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ విద్యుత్ కోతలు

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారుల ఫిర్యాదు



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న రమణ

జీడిమెట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలో మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ కరెంట్ కోతలు పెడుతున్నారని వినియోగదారులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు మొర పెట్టుకున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పరిష్కార వేదికకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పారిశ్రామికవేత్తలు, వివిధ కాలనీల ప్రజలు ఈ వేదికకు హాజరై పలు సమస్యలను అధికారులు, చైర్‌పర్సన్ బి.లలిత, ఫైనాన్స్‌మెంబర్ కె.శోభ, స్వతంత్ర సభ్యులు వి.అనిల్‌రెడ్డిల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈ వీరేశలింగం, అధికారులు, వల్లభనేని వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ లోక్ అదాలత్‌లో 523 కేసులు పరిష్కారం

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని దివాన్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో మేడ్చల్ కోర్టు 9వ మెట్రో పాలిటిన్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ పవన్ 523 వాహన కేసులను పరిష్కరించారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ పోలీసులు

భద్రతపై విద్యార్థినులకు షీ టీం అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆపద వస్తే భయపడి పోకుండా ప్రమాదం నుంచి బయటపడే అవకాశాలను పరిశీలించాలని షీ టీమ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కూకట్‌పల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో మూసాపేటలోని పంచశీల హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన శనివారం కల్పించారు. మహిళల భద్రత కోసం పెట్టిన షీ టీమ్ విద్యార్థినులకు అండగా ఉంటుందన్న విషయం అందరూ గుర్తించాలని హెడ్ కానిస్టేబుల్స్ అప్పారావు, శ్రీనివాసరావు, ప్రమీల సూచించారు. డయల్ 100కు సమాచారం ఇస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



గాజులరామారం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదకరంగా మారింది. గాజులరామారం డివిజన్‌లోని చెన్నకేశవనగర్ రోడ్డు నెంబరు-3లో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు బయటకు కనిపిస్తూ ఉన్నాయి. వాటి నుంచి నెల రోజులుగా మంటలు వెలువడుతున్నాయి. కురుస్తున్న వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ విద్యుత్ సరఫరా అవుతుండడంతో మూగజీవాలు అటువైపు వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గాజులరామారం ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ వాపోయాడు.

మురుగు నీటిని కట్టడి చేయాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి నుంచి దూలపల్లికి వేళ్లే ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు చేరి కంపుకొడుతోంది. ఈ రహదారి వెంట ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదాచారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆరోపించారు. ఈ ప్రాంతంలో నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రహదారి ప్రక్కనే మురుగు నీరు

భక్తుల కొంగుబంగారం వేణుగోపాలస్వామి

- నేటి నుంచి గోవర్ధనగిరి తిరునాళ్లు
- ఈనెల 26న కల్యాణం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, ప్రశాంతతకు మారు పేరుగా నిలుస్తోంది గోవర్ధనగి. కేపీహెచ్‌బీ మలేషియన్‌టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తోంది. 1987లో గుట్టపై వేణుగోపాలుడు ఆనవాళ్లు కనిపించడంతో ఆయనే ఇక్కడ స్వయంభువుగా వెలిసినట్లు భక్తులు విశ్వసించి పూజలు చేస్తున్నారు.

● నాడు వందల్లో .. నేడు వేలమంది

కేపీహెచ్‌బీ పరిసర ప్రాంత ప్రజలకు గోవర్ధనగిరి అంటే తెలియనివారుండరు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ పన్నాల హరీష్‌చంద్రారెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆలయ అభివృద్ధి శరవేగంగా జరిగిందని స్థానికులు చెబుతుంటారు. ఈ ప్రాంతంలో వేణుగోపాలస్వామి ఆనవాళ్లు గుర్తించినప్పటి నుంచి గోవర్ధనిగిరిగా మారింది. కొందరు భక్తులు కలిసి సుబ్బారావు అనే పూజారిని నియమించి రోజూ పూజలు, దూపదీప నైవేద్యాలతో దేదీప్యమానంతో ఆలయం విరాజిల్లుతోంది.



వేణుగోపాలస్వామి

ఇక్కడ ప్రధానంగా ఆలయ వార్షికోత్సవం, ముక్కోటి ఏకాదశి, కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 2010లో ఆలయం నిర్మించి వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య రాజ్యలక్ష్మి, గోదాదేవి, రుక్మిణీ-సత్యభామ సమేత వేణుగోపాలుడు విగ్రహాలను ప్రతిష్ఠించారు. కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి. దీనికి తోడు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆలయానికి అనుబంధంగా గోశాల ఉంది. రెండు ఆవులతో ప్రారంభమైన గోశాల.. నేడు 30 గోవులతో కళకళలాడుతోంది.

మూడు రోజుల పాటు తిరునాళ్లు

శ్రీకృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గోవర్ధనగిరి తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు సుమారు 10 వేల మంది వస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు భావించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26న ఉదయం 9 గంటలకు రుక్మిణీ-సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి మహాకల్యాణం నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నసమారాదన చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు ఉట్టి కార్యక్రమం ఉంటుంది.

చందానగర్ డీసీగా మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్‌గా మో హన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్‌గా విధు లు నిర్వహించి చందానగర్ సర్కిల్‌కు వచ్చా రు. ఇక్కడ డీసీగా విధులు నిర్వహించిన వంశీకృష్ణ ఉన్నత చదువులకు సెలవుపై వెళ్లాడు. ఆయన స్థానంలో మోహన్‌రెడ్డి వచ్చారు.

శేరిలింగంపల్లి డీసీగా ముకుందరెడ్డి



ముకుందరెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్‌గా ముకుందరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రజనీకాంత్‌రెడ్డి ఖైరతాబాద్ సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. కాగా ముకుందరెడ్డి గతంలో కాప్రా డిప్యూటీ కమిషనర్‌గా పని చేశారు.

హైకోర్టు ఆదేశాలతో వివాదాస్పద భవనం కూల్చివేత

జీడిమెట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సూరారంకాలనీలో వివాదాస్పద స్థలంలో అక్రమంగా నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం కూల్చివేశారు. ఉదయం 10 గంటలకు సర్కిల్ అధికారులు కూల్చివేతలు ప్రారంభించడంతో బాధితులు అడ్డుకున్నారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించడంతో కొందరు మహిళలు క్రషర్ ట్రాక్టర్ సిబ్బందిపై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. వివరాల్లోకి వెళితే. సూరారంకాలనీ సర్వేనెంబర్ 107లో రజిత, ఎం.డి మెహమూద్‌ల మధ్య 65 గజాల ప్లాట్ విషయంలో కొన్ని సంవత్సరాలుగా వివాదం రగులుతోంది.



భవనం కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

రజిత ఈ ప్లాట్‌ను ముందుగా తాను కొనుగోలు చేశానని, మెహమూద్ అక్రమంగా భవనం నిర్మించాడని దీనిని కూల్చివేయాలని హైకోర్టును ఆశ్రయించింది. కేసు పరిశీలించిన కోర్టు అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ వి.నర్సింహ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు సూరారంకాలనీ స్వాగత్‌నగర్‌లోని మూడంతస్తుల భవనాన్ని యంత్రాల సాయంతో కూల్చివేశారు. అధికారులు అన్యాయంగా తమ భవనాన్ని కూల్చివేశారని బాధితుడు మెహమూద్ కుటుంబసభ్యులు వాపోయారు. కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టామని ఉపకమిషనర్ నర్సింహ పేర్కొన్నారు.

దొంగతనం చేశాడని కర్రతో దాడి

మృతి చెందిన యువకుడు



దత్తు (ఫైల్)

హైదర్‌నగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): తన పండ్ల బండి వద్దకు వచ్చి తరుచూ చోరీకి పాల్పడుతున్న ఓ యువకుడిని పండ్ల వ్యాపారి హత్య చేసినఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మొహమ్మద్ ఉస్మాన్ అనే వ్యక్తి అడ్డగుట్టలో అరిటి పండ్లను తోపుడు బండిపై అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఉస్మాన్‌కి దత్తు అలియాస్ అషు(26) అనే చిల్లర దొంగతో కొంతకాలంగా పరిచయం ఉంది. మెదక్‌జిల్లా బెజరాన్‌పల్లికి చెందిన దత్తు అడ్డగుట్టలోని ఓ హాస్టల్‌లో ఉంటూ వాటర్ సప్లయర్‌గా పని చేస్తున్నాడు. తరుచూ ఉస్మాన్ పండ్లబండి వద్దకు వచ్చే దత్తు బండిపై ఉన్న గల్లాపెట్టె నుంచి డబ్బులు ఎత్తుకెళ్లేవాడు. వారంరోజుల క్రితం పండ్ల బండి వద్దకు వచ్చిన దత్తు ఉస్మాన్ సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తన బండి వద్దకు వచ్చిన దత్తుతో ఉస్మాన్ వాగ్వాదానికి దిగి అక్కడే ఉన్న కర్రతో అతడిపై దాడి చేశాడు. దత్తు తలకు తీవ్రగాయాలు కావడంతో అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఉస్మాన్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి కోసం వచ్చాడు..

గంజాయి వ్యాపారిగా మారాడు!

- విక్రేతతో పాటు మరో ఇద్దరి అరెస్టు
- 40 బాటిళ్ల హాష్ ఆయిల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్ సీసాలు

అల్లాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నగరానికి వచ్చిన యువకుడు గంజాయికి అలవాటు పడటమే కాకుండా తాను కూడా గంజాయి విక్రేతగా మారాడు. ఇతడితో పాటు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని అల్లాపూర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అల్లాపూర్ రాణా ఎస్‌హెచ్ఓ వెంకట రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల లీలా వెంకట శివరాం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి అల్లాపూర్ లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఇతను గంజాయికి అలవాటు పడ్డాడు. అదే గంజాయిని విక్రయించి ఎక్కువ డబ్బు సంపాదించి జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. గంజాయి హష్ ఆయిల్‌ను పరిచయస్తుడు నూతక్కి సనీత్ అలియాస్ సన్నీతో కలిసి తన రూమ్‌లో నిల్వ ఉంచుకుని మాదాపూర్, పర్వత్ నగర్ ప్రాంతాల్లో కస్టమర్లకు విక్రయిస్తున్నాడు. కాగా, వెంకట శివరాం లక్ష్మీనగర్‌లోని తన రూమ్‌లో హష్ ఆయిల్ నిల్వ చేశాడని విశ్వసనీయ సమాచారం అందడంతో అల్లాపూర్ పోలీసులు సోదాలు నిర్వహించారు. శివరాంతో పాటు హష్ ఆయిల్ కొనుగోలు చేసేందుకొచ్చిన అరుణ్ కుమార్, షణ్ముఖ సాయి అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 160 గ్రాముల (40 బాటిళ్ల) హష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న అల్లాపూర్ పోలీసులను ఏసీపీ శ్రీనివాస్ రావు అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం సామూహిక భవనం ప్రారంభం

హైదర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ఆర్యవైశ్య సంఘ భవనాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో భిక్షపతియాదవ్ ఆర్యవైశ్య సంఘ స్థలం గురించి, భవానికి కావాల్సిన మౌలిక వసతులు, రోడ్ల మరమ్మతుకు ఎంతగానో తోడ్పాటు అందించారని తెలిపారు. సంఘ సభ్యుల ప్రయోజనం కోసం భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ వ్యవస్థాపకుడు పుల్లయ్యగుప్తా, అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, కొండలరావుగుప్తా, ప్రవీణ్‌గుప్తా, జి.శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

నిజాంపేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని ఇన్ఫైట్ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ వీసీ చీమలకొండ అన్నారు. బాచుపల్లిలో గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాలలో 24వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చీమలకొండ మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప గోల్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకొని, జాతి ఉన్నతికి తోడ్పడి మంచి పౌరుడిగా ఉండాలన్నారు. గ్రిట్ వంటి విద్యా సంస్థల్లో చదువు సాగించి, డిగ్రీ పట్టా పొందడమే కాక, ఉన్నత స్థాయి ఉద్యోగాలు సంపాదించుకునేందుకు విద్యార్థులకు నిజమైన లెర్నింగ్ అప్పుడే మొదలవుతుందన్నారు. డిగ్రీ పట్టా పొందిన తరువాత నిత్యం విద్యార్థులుగా శ్రమిస్తేనే అనుకున్నది సాధించొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ జుగ్గే, సీఎస్ఈ విభాగాధి పతి డాక్టర్లు శంకర్‌బాబు, చార్లెస్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘం నాయకులను అడ్డుకుంటున్న పోలీసుల

ఇంజనీరింగ్ సీట్లు ఇస్తామని మోసం

- కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ కళాశాల ఎదుట ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ సీట్ల కోసం విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన యాజమాన్యం వారికి సీట్లు ఇవ్వకుండా మోసం చేసిందని విద్యార్థులు, తల్లిదండ్రులు, జేఏసీ విద్యార్థి సంఘం నాయకులు, ఏబీవీపీ నేతలతో కలిసి శనివారం కళాశాల గేటు వద్ద ఆందోళన చేశారు. విద్యార్థి సంఘం నాయకులు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో వారు గేటు వద్దే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ తమ పిల్లలకు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు ఇస్తామని లక్షల రూపాయలు వసూలు చేసి, ఇప్పుడేమో సీట్లు లేవు, అని ఫోన్ చేసి చెప్పడం ఏమిటని కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అక్కడ నుంచి పంపించి వేశారు.



హెచ్‌ఎంటీ వాకో హైస్కూల్ 1999 బ్యాచ్ విద్యార్థులు స్కూల్ క్యాంపస్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం జరుపుకున్నారు. ఈ వేడుకలకు 70 మంది విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు హాజరై ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

- గాజులరామారం, ఆంధ్రజ్యోతి

నిజాంపేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధిపై సమీక్షా సమావేశం

నిజాంపేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసే విషయంపై మేయర్ కొలన్ నీలా రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ పవన్‌కుమార్‌లతో కలిసి ఆయా విభాగాల అధికారులతో కార్యాలయంలో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులపై చర్చించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. 33వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీ, ఎస్‌ఎన్‌డీపీ నాలాలు, రోడ్డు ప్యాచ్ వర్క్, కాలనీల్లో దోమల ఫాగింగ్, పెరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ తీగలు, స్తంభాలు, వరద నీటి తొలగింపు, డెగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను సూచించారు. కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్ట్



నిందితులతో క్రైం పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కైత్లాపూర్ రోడ్డులోని మెరీనా స్కైస్ టవర్-2లోని ఫ్లాట్ నంబర్ 2508లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు, సేవిస్తున్న మరో ఇద్దరు యువకులను కూకట్‌పల్లి క్రైం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, సంపన్న వర్గాలు నివాసం ఉండే ప్రాంతాల్లో గంజాయి అమ్ముతూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి అమ్ముతున్న వారిలో రెడ్డివారి సాయిచరణ్‌రెడ్డి (23), అక్షత జగదీష్(23), రెడ్డిగారి సాయికిరణ్ రెడ్డి(23) ముగ్గురు స్నేహితులు. వీరి అవసరం మేరకు వినియోగించుకొని మిగతా గంజాయినీ విక్రయించేవారు. రైడ్ సమయంలో కొనుగోలు కోసం వచ్చిన మొరబోయిన మాలకొండయ్య(24), షేక్ అర్షద్ కూడా ఉన్నారు. వారి నుంచి 1.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురు యువకులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ ముత్తు తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక

నవవధువు ఆత్మహత్యాయత్నం

జీడిమెట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తింటివారు పెట్టే బాధలు భరించలేక ఓ నవ వధువు యాసిడ్ తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం... జగద్గిరిగుట్టలోని రిక్షాపుల్లర్స్ కాలనీకి చెందిన వాటర్ లైన్‌మెన్ కృష్ణ కుమార్తె దండంపల్లి మనీషా(26), వారి ఇంటి పక్కనే ఉంటున్న ఎల్లయ్య కుమారుడు కానిస్టేబుల్ రాజశేఖర్(32)ను ప్రేమించింది. పెద్దల సమక్షంలో గత నెల 10వ తేదీన వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. లక్షల కట్నంగా ఇచ్చారు. కాగా, పెళ్లి చేసుకున్న వారం రోజులకే రాజశేఖర్‌పై అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లాడు. అప్పటి నుంచి నీవు వచ్చిన తర్వాతే తమ కుమారుడు జైలుకు వెళ్లాడని, అదనపు కట్నం తీసుకురావాలని అత్తింటివారు మనీషాను వేధించడం మొదలు పెట్టారు. కాగా, గతనెల 25వ తేదీన భర్త జైలు నుంచి విడుదలయ్యాడని తెలిసి ఈనెల 11న మనీషా తండ్రితో కలిసి అత్తింటికి వెళ్లగా అదనపు కట్నం తీసుకు వస్తేనే ఇంట్లో అడుగుపెట్టాలని దుర్భాషలాడారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మనీషా బాత్రూంలోని యాసిడ్ తాగి అపస్మారక స్థితికి చేరింది. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భర్త రాజశేఖర్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణాష్టమి సందర్భంగా మూసాపేట, కేపీహెచ్‌బీ పరిధిలోని ఓ స్కూల్లో శనివారం చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి



కళాకారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన సంగీత అయ్యర్ తన భరతనాట్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, శాంతాకారం, త్యాగరాజకృతి, అన్నమాచార్య కీర్తన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. సత్యం డాన్స్ అకాడమి కూచిపూడి నాట్య గురువర్యులు కామేశ్వరి శిష్య బృందం మధురాష్టకం, కృష్ణం వందే జగద్గురు, కస్తూరి తిలకం తదితర అంశాలపై చక్కటి ప్రదర్శనతో సందర్శకుల మదిని దోచుకున్నారు.